సాక్షి వికారాబాద్

సోమవారం ၊ 19 ၊ జూన్ ၊ 2023



'అభయ హస్తం' అంతేనా!

అభయ హస్తం పథకం రద్దు చేయడంతో ప్రీమియం చెల్లించిన డ్వాక్రా మహిళలు ఆందోళన చెందుతున్నారు. 8లో▸



కారు బోల్తా

దైవదర్శనానికి వెళ్తుండగా కారు బోల్తాపడి ఒకరు మృతి చెందారు. ఈ ఘటన పెద్దేముల్‌లో చోటుచేసుకుంది. 8లో▸



పెట్టుబడి సాయం కోసం..

సాగు పెట్టుబడి సాయం కోసం రైతుబంధు పంపిణీకి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. 9లో▸

న్యూస్‌రీల్

ఘనంగా మట్టిఎడ్ల అమావాస్య



మట్టితో చేసిన బసవన్నలకు పూజలు

కొడంగల్: రైతులు ఆదివారం మట్టి ఎడ్ల అమావాస్యను ఘనంగా నిర్వహించారు. మట్టితో బసవన్నలను తయారు చేసి పూజలు చేశారు. పిండి వంటలు చేసి నైవేద్యం సమర్పించారు. వానాకాలం సీజన్ ప్రారంభమైన తర్వాత మొదటగా ఏరువాక పౌర్ణమి వస్తుంది. ఆ తర్వాత మట్టి ఎడ్ల అమావాస్య వస్తుంది. ఈ రోజు నుంచే రైతులు విత్తనాలు వేయడానికి సిద్ధమవుతారు.

కరుణించు మాత



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

బషీరాబాద్: మండలంలోని దామర్‌చెడ్‌లోని భవానీనగర్‌లో వెలసిన అంబాభవానీ మాతకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం అమావాస్య కావడంతో అమ్మవారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. కోరిన కోరికలు తీర్చే అమ్మవారికి మహిళలు చీరలు సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ పీఠాధిపతి, రాష్ట్ర సాధూపరిషత్ అధ్యక్షుడు శంకర్ స్వామిజీ ప్రవచనాలు చెప్పారు. అనంతరం అన్నదానం చేశారు.

పాంబండలో భక్తుల సందడి



రామలింగేశ్వర స్వామి దేవాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

కుల్కచర్ల: మండల పరిధిలోని బండవెల్కిచర్లలో వెలసిన పాంబండకు భక్తులు తరలివచ్చారు. అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచే భక్తుల సందడి నెలకొంది. ఆలయ నిర్వాహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకున్నారు.

కనీస వేతనాలు చెల్లించండి



మాట్లాడుతున్న కార్మికులు

కొడంగల్: వేతనాలు పెంచాలంటూ మిషన్ భగీరథ హెల్పర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం డీఈఈ శశాంక్‌కు వినతి పత్రం ఇచ్చారు. అనంతరం మిషన్ భగీరథ ప్లాంట్ బయట వారు విలేకరులతో మాట్లాడారు. ఇరవై ఏళ్లకుపైగా తాము కాగ్నా మంచినీటి పథకంలో పనిచేస్తున్నట్లు చెప్పారు. కాగ్నా రక్షిత మంచినీటి పథకాన్ని మిషన్ భగీరథలో విలీనం చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం 78 మంది కార్మికులు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో మంచినీటిని సరఫరా చేస్తున్నారని తెలిపారు. ప్రతి నెలా రూ.పదివేల వేతనం ఇస్తున్నట్లు చెప్పారు. పెరిగిన ధరలతో వేతనం సరిపోవడం లేదని, బతుకులు దుర్భరంగా మారాయని వాపోయారు. ప్రభుత్వం స్పందించి రెగ్యులర్ చేయడమే కాకుండా వేతనాలను పెంచాలని కోరారు.

అంబేడ్కర్ అందరివాడు

కొందుర్గు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కులానికో, మతానికో, వర్గానికో సంబంధించిన వ్యక్తి కారని.. అందరివాడని బీఎస్పీ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లిలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంబేడ్కర్ మనందరికీ రాజ్యాంగం అనే గొప్ప గ్రంథాన్ని అందించి మార్గదర్శకుడయ్యారని కొనియాడారు. ప్రజాస్వామ్యవ్యవస్థలో ఓటు విలువ చాలా గొప్పదని.. డబ్బుకు, మద్యానికి అమ్ముకోకూడదన్నారు. సరైన నాయకుడికి ఓటువేసి దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు.



సీఎం సభ కోసం సిద్ధమవుతున్న వేదిక



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి సబితారెడ్డి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ఎంపీ రంజిత్

సర్వం సిద్ధం

- నేడు రంగారెడ్డి జిల్లాకు కేసీఆర్ రాక
- తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్‌లో మొక్కలు నాటనున్న ముఖ్యమంత్రి
- మ్యాక్ క్రికెట్ గ్రౌండ్‌లో బహిరంగ సభ
- మహేశ్వరం నుంచి 20 వేల మందిని తరలించాలని నిర్ణయం
- 25 వేల మొక్కలను సిద్ధం చేసిన ఫారెస్ట్ అధికారులు.. భారీ పోలీసు భద్రత
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సబిత, సీఎస్ శాంతకుమారి, ఎంపీ రంజిత్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లాలో నిర్వహించే 'హరితహారం' కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్‌లో ఉదయం 11 గంటలకు మొక్కలు నాటి తెలంగాణ హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభిం చనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఫారెస్ట్ అధికారులు 25 వేల మొక్కలను సిద్ధం చేశారు. సీఎం రాక నేపథ్యంలో పోలీసులు, జిల్లా రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఫారెస్ట్ పక్కనే హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. ఈ మేరకు ఆదివారం మంత్రి సబితారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, కలెక్టర్ హరీశ్, ఫారెస్ట్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు. వీఐపీలు, మహిళలు, పార్టీ ప్రముఖుల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు.

బహిరంగ సభకు ఏర్పాట్లు

హరితహారంలో భాగంగా మొక్కలు నాటిన తర్వాత జిల్లా వాసులను ఉద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. ఇందుకోసం మ్యాక్స్ పక్కనే ఉన్న క్రికెట్ గ్రౌండ్‌లో సభా వేదికను ఏర్పాటు చేశారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, అధికారులు కూర్చొనేందుకు వీలుగా 15 వేల కుర్చీలను సమకూర్చారు. మంత్రి సబితారెడ్డి అధ్యక్షతన నిర్వహించే సభకు మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్, కడ్తాల్ మండలాల నుంచి 20 వేల మందిని తరలించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. సీఎం పర్యటన నేపథ్యంలో తుమ్మలూరు ఫార్టెస్ పరిసరాలతో పాటు శ్రీశైలం జాతీ య రహదారిపై పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. సభాస్థలికి సమీపంలోని ఖాళీ స్థలాల్లో పార్కింగ్ సదుపాయం కల్పించారు.

సభను విజయవంతం చేయాలి: మంత్రి సబితారెడ్డి

సీఎం కేసీఆర్ నేతృత్వంలో జిల్లా రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అనేక పరిశ్రమలకు నెలవుగా నిలిచింది. ఆశించిన దానికంటే అధిక నిధులు జిల్లాకు కేటాయించారు. ఫ్యాబ్‌సిటీ, చందనవెల్లి పారిశ్రామికవాడ సహా ఫార్మాసిటీలను ఏర్పాటు చేశారు. అనేక కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. విప్రో, అమేజాన్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ వెలిశాయి. ఇప్పటికే ఫాక్స్‌కాన్ కంపెనీ భూమిపూజ కూడా చేసింది. ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. హరితహారం కార్యక్రమంతో తెలంగాణ పచ్చబడింది. ఈ ఏడాది హరితహారం కార్యక్రమం నా సొంత నియోజకవర్గం మహేశ్వరంలో ప్రారంభం కాబోతుండటం సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా నిర్వహించే సభకు జిల్లా నుంచి భారీగా తరలిరావాలి. కార్యక్రమాన్ని విజయవ ంతం చేయాలి.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎన్.రాజు స్పష్టం చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సరూర్‌నగర్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపడితే పోలీసులు లాఠీచార్జీ చేసి అక్రమ కేసులు పెట్టడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో ఎంతోమంది సొంతఇళ్లు లేక అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోకుండా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్న పేదలపై కేసులు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. పేదల పక్షాన పోరాడి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చేలా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్, ఈశ్వర్ నాయక్, సాయిబాబ, మల్లేశ్, ఈశ్వర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ రేపటితో ఆఖరు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, జర్నలిజం, లైబ్రరీ సైన్స్, ఎంఎస్‌డబ్ల్యూ తదితర పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షలకు రూ.2000 అపరాధ రుసుముతో మంగళవారంతో గడువు ముగియనుంది. రూ.500 అపరాధ రుసుముతో దరఖాస్తుల స్వీకరణ గడువు ఆదివారంతో (ఈ నెల 18న) ముగిసినట్లు టీఎస్‌సీపీజీఈటీ కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 69 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు.

సతతం.. హరితం

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే అత్యంత ప్రాధాన్యత పథకాల్లో హరితహారం ఒకటి. ప్రభుత్వం తొమ్మిదేళ్లుగా నిర్విరామంగా చేపడుతుండటం.. అందుకు అవసరమైన నిధులను కేటాయిస్తుండటంతో పథకం ప్రాధాన్యతను సామాన్య ప్రజలు సైతం గుర్తించారు. జూన్ వచ్చిందంటే హరితహారం కార్యక్రమం గుర్తుకు వచ్చే స్థాయిలో ఏటా అట్టహాసంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇలా తొమ్మిదేళ్లలో సాధించిన హరితహారం విజయాన్ని ప్రత్యేక రాష్ట్రం దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం హరితోత్సవం జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక కథనం..

'మొక్క'వోని దీక్షకు తొమ్మిదేళ్లు

- విరివిగా మొక్కల పెంపకం
- అటవీశాఖ, డీఆర్‌డీఏ ముఖ్య భూమిక
- పచ్చగా మారిన రహదారులు, పల్లెలు
- నేడు తెలంగాణ హరితోత్సవం



పూల మొక్కలతో పల్లె ప్రకృతి వనం

జిల్లాలో చేపట్టిన హరితహారం ఇలా..

ఇప్పటి వరకు నాటిన మొక్కలు:	4.27 కోట్లు
ఏర్పాటు చేసిన నర్సరీలు:	599
ఖర్చు చేసిన నిధులు:	రూ.71.97 కోట్లు
పల్లె ప్రకృతి వనాలు:	715
బృహత్ ప్రకృతి వనాలు:	71
రహదారి వనాలు:	634 కిలోమీటర్లు



నాటిన మొక్కలతో పచ్చందాలు

వికారాబాద్ అర్బన్: రానున్న తరాలకు స్వచ్ఛమైన గాలి, నివాస యోగ్యమైన ప్రకృతి పరిసరాలను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం 2015లో హరితహారం కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలను ఒక సామాజిక బాధ్యతగా పెద్ద ఎత్తున భాగస్వాములను చేసిన ఘనత ప్రభుత్వానికి దక్కుతుంది. అలాగే మొక్కలు నాటడంలో తమకు సంబంధమే లేదనుకున్న అనేక ప్రభుత్వ శాఖలు సైతం భాగస్వాములై మొక్కలు నాటుతున్నాయి. ప్రభుత్వం కృషి, పట్టుదల కారణంగానే ఈ రోజు మారుమూల పల్లెల్లోని రోడ్లు, పట్టణాల్లోన్ని వీధులు, ప్రభుత్వ కార్యాలయాల ఎదుట, ప్రధాన రోడ్లు ఆకుపచ్చగా కనిపిస్తున్నాయి. జిల్లాలో 44 వేల హెక్టార్లలో ఉన్న అడవి తొమ్మిది ఏళ్లుగా నిర్వహించిన హరితహారంతో అటవీ మరింత దట్టంగా మారి 5 శాతం గ్రీనరీ పెరిగింది. నాటిన అనేక మొక్కలు నేడు చెట్లుగా మారాయి.

అటవీ పునరుద్ధరణ..

హరితహారం కార్యక్రమంలో అటవీశాఖ పాత్ర ఎంతో కీలకం. హరితహార కార్యక్రమాన్ని ముందుండి నడిపిస్తూ అన్నీ శాఖలకు సహకారాన్ని అందిస్తూ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు. అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ తొమ్మిది ఏళ్లలో అర్బన్ ఫారెస్ట్ ఏరియాలో 530.9 హెక్టార్లలో 53 లక్షల మొక్కలు నాటారు. అడవిని రక్షించాలనే ఉద్దేశంతో 538 కిలోమీటర్ల మేర చుట్టూ కందకాలను తవ్వారు. అడవిలో చెలరేగే అగ్ని ప్రమాదాల నివారణకు గాను 515 కిలో మీటర్ల మేర ఫైర్ లైన్లు కూడా ఏర్పాటు చేశారు. నీటి యాజమాన్య పద్ధతుల అమలులో భాగంగా 119 చెక్ డ్యామ్‌లు, 222 ఇంకుడు చెరువులు కూడా చేపట్టి అటవీ విస్తీర్ణంలో ముఖ్య భూమిక పోషిస్తున్నారు. అదే విధంగా నాలుగు అర్బన్ ఫారెస్ట్ పార్కులు కూడా ఏర్పాటు చేశారు. ఇవి దాదాపు 340.86 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. వీటితో పాటు మూడు హరిత వనాలను 217.36 ఎకరాల్లో ఏర్పాటు చేయగా 29వేల మొక్కలు నాటారు.

ఉపాధి హామీ కీలక పాత్ర

హరితహారం కార్యక్రమం విజయవంతం చేయడంలో గ్రామీణ ఉపాధి హామీ సంస్థ ముఖ్య భూమిక పోషించింది. డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈ తొమ్మిది ఏళ్లలో 2.19 కోట్ల మొక్కలు నాటారు. ఇరిగేషన్, విద్యాశాఖ, గ్రామ కంఠం, రెవెన్యూ, పంచాయతీ రాజ్ , ఆర్‌అండ్‌బీ శాఖల్లో డీఆర్‌డీఏ భాగస్వామ్యం అవుతూ ముందుకు సాగుతోంది. గ్రామాల్లోని పల్లె ప్రకృతి వనాలను, నర్సరీల నిర్వహణను పూర్తి స్థాయిలో చేపడుతోంది.

భగీరథతో తొలగిన నీటి కష్టాలు

- ప్రతి ఇంటికీ మంచినీరు అందించడం విప్లవాత్మకం
- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి
- ఘనంగా మంచి నీళ్ల దినోత్సవం

పరిగి: గతంలో వేసవి వచ్చిందంటే నీటి కష్టాలు తప్పేవి కావని, భగీరథ పథకంతో నేడు ఎక్కడా అలాంటి కష్టాలు కనిపించడం లేదని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మండల పరిధిలోని జాపర్‌పల్లిలో మంచి నీళ్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం రాక ముందు నీటి కష్టాలు ఎలా ఉన్నాయో వచ్చిన తరువాత ఎలా ఉందో పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. అక్కా చెల్లెల్లు నీటి కోసం బిందెలు పట్టుకుని క్యూలైన్లో ఉండేవారన్నారు. కానీ నేడు భగీరథ వల్ల ప్రతి రోజు ఇంటి దగ్గరే పుష్కలంగా నీళ్లు వస్తున్నాయన్నారు. ఇంటింటికీ నల్లా కనెక్షన్ ఇచ్చి నీటిని సరఫరా చేయడం మామూలు విషయం కాదన్నారు. ఎంతో మంది ప్రతి పక్ష నాయకులు పైప్‌లైన్ల కోసం కాలువలు తీస్తుంటే ఇది అయ్యే పని కాదని అన్నారన్నారు. ఇప్పుడు వాళ్ల ఇంటికి కూడా భగీరథ నీరు వస్తుందన్నారు. ఇలా ఇది ఒక్కటే కాదు ప్రజా సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. మన రాష్ట్రాన్ని దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టారన్నారు. దేశం మొత్తం తెలంగాణ వైపు చూసేలా ప్రభుత్వం చేసిందన్నారు. అనంతరం కలెక్టర్ నారాయణ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి ఇంటికి మంచి నీరును అందిస్తున్నామన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందేలా కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డీపీఓ తరుణ్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, జెడ్పీటీసీ హరిప్రియ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్‌కృష్ణ, ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఆయ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి, చిత్రంలో కలెక్టర్ తదితరులు

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే

- ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి
- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: పార్టీ కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని, రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు టి. రామ్మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండలం రాంరెడ్డిపల్లికి చెందిన సుమారు 50 మంది బీఆర్‌ఎస్ నాయకులు పట్టణ కేంద్రంలోని టీఆర్‌ఆర్ నివాసంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇతర పార్టీలో నుంచి వచ్చిన ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం లభిస్తుందన్నారు. కేంద్రంలో మోదీని, రాష్ట్రంలో కేసీఆర్‌ను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టాలని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అమలు చేసిన అభివృద్ధి పనులే నేటికీ దర్శనమిస్తున్నాయన్నారు. కార్యకర్తలు నిత్యం ప్రజల్లో ఉండి ప్రజా సమస్యలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న అన్యాయాలపై వివరించాలన్నారు. కష్టపడి పనిచేసిన కార్యకర్తలకు పార్టీ ఎల్లప్పుడూ గుర్తిస్తుందన్నారు. పార్టీ అభ్యున్నతి కోసం పనిచేసిన వారికి పదవులు లభిస్తాయన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, కుల్కచర్ల మండల అధ్యక్షుడు ఆంజనేయులుముదిరాజ్, జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకులతో డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

వీడని భగభగలు.. రైతన్నలో దిగులు

- కానరాని నైరుతి రుతుపవనాలు
- అదను దాటుతుండటంతో ఆందోళన
- జిల్లాలో 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు



గొట్టిగ దగ్గర పది రోజుల క్రితం విత్తినా మొలకెత్తని విత్తనం

బషీరాబాద్: యేటా జూన్ మొదటి వారంలోనే వర్షాకాలం ప్రారంభం అవుతుంది. ఒక వేళ రుతుపవనాలు ఆలస్యమైనా వాతావరణం మాత్రం చల్లబడుతుంది. కానీ ఈ సారి పరిస్థితులు పూర్తి విరుద్ధంగా ఉన్నాయి. వానాకాలం ప్రారంభమై పది రోజులు దాటినా.. ఇంకా వేసవి కాలాన్నే తలపిస్తోంది. వర్షాలు పడాల్సిన సమయంలో ఎండలు మండిపోతున్నాయి. జిల్లాలో ఆదివారం 39.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడమే కాకుండా.. వడగాలులు వీచాయి.

విత్తనాలు విత్తారు..

ఈ నెల మొదటి వారంలో జిల్లాలో అక్కడక్కడా కురిసిన అడపాదడపా చిరుజల్లులకు భూమి పదును ఉందని రైతులు విత్తనాలు విత్తారు. అయితే విత్తనాలు విత్తి రెండు వారాలు కావస్తున్నా.. వానల జాడలేదు. దీంతో విత్తనం మొలకెత్తలేదు. ఎండలకు పదును ఆరిపోయి విత్తు భూములోనే ఉండిపోయాయి. అక్కడక్కడా చిన్న పాటి పిలకలు మొలసినా ఎండల తాకిడికి వాడిపోతున్నాయి. దీంతో పెట్టుబడి పెట్టి విత్తనాలు వేసిన అన్నదాతలు తీవ్ర ఆందోళనలు చెందుతున్నారు. జూన్ 4వ వారం ప్రారంభం అయినా నైరుతి జాడ కనిపించడం లేదు. వానలు మరింత ఆలస్యం అవుతాయని వాతావరణ శాఖ ప్రకటనలతో.. ఏమి చేయాలో తెలియక రైతులు ఆకాశం వైపు చూస్తున్నారు.

పరిస్థితులు విచిత్రం

ఈ ఏడాది నడి వేసవిలో వానలు దంచి కొట్టగా, వానాకాలంలో ఎండలు మండిపోతున్నాయి. ఈ విచిత్ర వాతావరణ పరిస్థితులకు జనం కూడా ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. వేసవిలో ఉన్న విధంగానే ఉదయం 10 గంటలకే వడగాలులు వీస్తున్నాయి. దీంతో రోడ్ల మీదకు రావడానికి జనం జంకుతున్నారు. పొలం పనులకు వెళ్తున్న రైతులు, కూలీలు చెట్ల కింద సేద తీరుతున్నారు. రాత్రి వేళల్లో తీవ్రమైన ఉక్కపోతతో ప్రజలు ఏసీలు, కూలర్ల బటన్లు బంద్ చేయడంలేదు. రాబోయే మరో మూడు రోజులు ఎండలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం సాధారణ ఉష్ణోగ్రతల కంటే 4 నుంచి 5 డిగ్రీల ఉష్ణోగ్రతలు అధికంగా నమోదు కావడం ఆందోళన కలిగిస్తోంది.

క్లుప్తంగా

ఎడ్‌సెట్ స్టేట్ ర్యాంకర్‌కు సన్మానం



వినీషను సన్మానిస్తున్న గొల్లచ కురుమలు

కొడంగల్: ఎడ్‌సెట్ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిన వినీషను ఆదివారం ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ అతిథి గృహంలో యాదవ, కురుమ సంఘం ఆధ్వర్యంలో ఆమెకు సన్మానం కార్యక్రమం ఏర్పాటు చేశారు. తాండూరులోని గ్రీన్‌సిటీ కాలనీకు చెందిన వినీష తండ్రి గొల్ల మొగులప్ప ప్రభుత్వ ఉపాధ్యాయుడు. ఆయన కూతురు వినీష మే 18న నిర్వహించిన ఎడ్‌సెట్ ఎంట్రెన్స్ పరీక్షలో 150 మార్కులకుగాను 117 మార్కులు సాధించి రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఈ నేపథ్యంలో ఆమెను కొండగల్‌కు చెందిన గొల్లకురుమలను ఆమెను శాలువా, పూల మాలలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రవీంద్ర యాదవ్, 2వ వార్డు కౌన్సిలర్ మధుసూదన్ రావు యాదవ్, దౌల్తాబాద్ ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యుడు మహిపాల్, హస్నాబాద్ సర్పంచ్ పకీరప్ప, కురుమ మధు, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా రాజేందర్‌రెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న రాజేందర్‌రెడ్డి

అనంతగిరి: యువజన కాంగ్రెస్ జిల్లా కార్యదర్శిగా కొత్తగడికి చెందిన పటోళ్ల రాజేందర్‌రెడ్డి నియమిస్తూ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆదివారం ఆయనకు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సతీశ్‌రెడ్డి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, ముఖ్య నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ మురళి, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

గడ్డివాము దగ్ధం



దగ్ధమవుతున్న పశుగ్రాసం

దోమ: పశువుల మేతకు కొనుగోలు చేసుకుని ఏర్పాటుచేసుకున్న గడ్డివాము శనివారం అర్ధరాత్రి దగ్ధమైంది. మండల కేంద్రానికి మాలిస్ నిరంజన్‌రెడ్డి అనే రైతు తన పశువుల మేత కోసం నాలుగు ట్రాక్టర్ల గ్రాసం కొనుగోచేసి పొలంలో వాము వేసుకున్నాడు. కాగా తనతో పాత గొడవల కారణంగా గ్రామానికి చెందిన జాకారం కృష్ణయ్య, జాకారం నారాయణ అనే వ్యక్తులు గడ్డివాముకు నిప్పంటించారని బాధితుడు ఆరోపించాడు. ఈ క్రమంలో గమనించి గ్రామస్తులు ఫైర్ సిబ్బందికి సమాచారం ఇవ్వగా ఘటనాస్థలికి చేరకుని మంటలార్పే ప్రయత్నం చేయగా అప్పటికే పవుగ్రాసమంతా కాలి బూడిదయింది. దీంతో సుమారు రూ.70వేల నష్టం వాటిల్లిందని బాధిత రైతు వాపోయాడు. ఈ ఘటనపై ఎస్‌ఐ విశ్వజన్‌ను వివరణ కోరగా ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు.

'అభయ హస్తం' అంతేనా!

అభయ హస్తం పథకాన్ని రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వం డ్వాక్రా మహిళలు చెల్లించిన ప్రీమియం వాపస్ ఇవ్వడంలో అలసత్వం వహిస్తోంది. 2020 మార్చి 15న పథకాన్ని రద్దు చేసి వారిలో అర్హులకు ఆసరా పెన్షన్లు, మిగిలిన వారికి డబ్బులు వాపస్ చెల్లిస్తామని చెప్పినా నేటికీ పట్టించుకోకపోవడంతో ప్రీమియం చెల్లించిన మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

- ప్రీమియం డబ్బులు ఖాతాలో జమ చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం
- పదేళ్లు కావస్తున్నా పట్టించుకోని వైనం
- ఆందోళన చెందుతున్న డ్వాక్రా మహిళలు



మోమిన్‌పేట మహిళా సమాఖ్య కార్యాలయం

మోమిన్‌పేట: అభయహస్తం పథకాన్ని ప్రభుత్వం రద్దు చేయడంతో ప్రీమియం చెల్లించిన డ్వాక్రా మహిళలు ఆందోళన చెందుతున్నారు. పథకం రద్దు చేసిన సమయంలో అర్హులకు ఆసరా పెన్షన్లు ఇచ్చి.. మిగిలిన వారికి డబ్బులు వాపస్ ఇస్తామని ప్రకటించింది. కానీ దాదాపు పదేళ్లు కావస్తున్నా ప్రభుత్వం నుంచి నేటికీ ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో ఉమ్మడి జిల్లాలోని 1,18,712 మంది లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రైవేటు సంస్థలు బోర్డు తిప్పివేస్తే అండగా ఉండాల్సినే ప్రభుత్వమే.. లబ్ధిదారుల గురించి పట్టించుకోకపోవడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2009 కాంగ్రెస్ ప్రభుత్వంలో దివంగత సీఎం వైఎస్సార్ సామాన్య పేద మహిళలు వృద్ధాప్యంలో పింఛన్ అందుకోవాలనే ఉద్దేశంతో అభయ హస్తం పథకాన్ని ప్రవేశపెట్టారు. 18 సంవత్సరాలు పైబడి 59ఏళ్ల లోపున్న మహిళలు డ్వాక్రా సంఘంలో సభ్యులైన ప్రతీ మహిళ ఈ పథకానికి అర్హులు. ఒక సభ్యురాలు ప్రతీ రోజు రుపాయి చొప్పున జమ చేస్తే అంతే మొత్తాన్ని ప్రభుత్వం జమ చేసింది. దీంతో 60 సంవత్సరాలు పైబడిన మహిళకు నెలకు రూ.500 నుంచి 5వేల వరకు పింఛన్ అందుతుందని నాలుగేళ్లు సజావుగా సాగినా.. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ప్రభుత్వం ప్రీమియం తీసుకోవడం మానేసింది. రెన్యూవల్ చేయించుకునేందుకు లబ్ధిదారులు ఎదరుచూశారు. అభయ హస్తం పథకంలో సభ్యులుగా చేరిన వారు మృతి చెందితే చెల్లించిన ప్రీమియం వడ్డీతో పాటు భీమా సౌకర్యాన్ని నామినీకి చెల్లించే సదుపాయం కల్పించారు. మండల పరిధిలోని 28 గ్రామ పంచాయతీల పరిధిలో 2,575మంది మహిళలు అభయ హస్తం పథకంలో సభ్యులుగా చేరారు. 2012–13 మార్చి నాటికి వారు చెల్లించిన ప్రీమియం రూ.5లక్షలకు పైగానే జమయింది. ప్రభుత్వం వెంటనే అభయ హస్తం లబ్ధిదారులకు వడ్డీతో సహ ప్రీమియం అందించాలని వారు కోరుతున్నారు.

రూ.6వేలు చెల్లించా



అభయ హస్తం పథకంలో చేరిన తర్వాత నాలుగేళ్లు నా వాటా కింద రూ.6వేలకు పైగా ప్రీమియం చెల్లించా. పథకం రద్దు చేసినా చెల్లించిన ప్రీమియం తిరిగి ఇవ్వలేదు. పథకం రద్దు చేసినప్పుడు సభ్యులకు చెల్లించాల్సిన ప్రీమియం ప్రభుత్వం వడ్డీతో సహా తిరిగివ్వాలి. – రుక్కమ్మ, ఎన్కేపల్లి

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు



ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. గ్రామాలకు వెళ్తే మహిళలు ప్రీమియం చెల్లించిన డబ్బులు ఎప్పుడిస్తారని ప్రశ్నిస్తున్నారు. వడ్డీతో సహా చెల్లించాలని కోరుతున్నారు.

– రాజు, ఐకేపీ ఏపీఎం, మోమిన్‌పేట

గిరిజనుల డిమాండ్లను పరిష్కరించాలి

రేపు ఇందిరాపార్క్ వద్ద ధర్నా

కొడంగల్ రూరల్: తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా అధ్యక్షుడు సూర్యానాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన పట్టణ శివారులోని బంజారాభవన్‌లో ఈ నెల 20న నగరంలోని ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సూర్యానాయక్ మాట్లాడుతూ.. 11 బీసీ కులాలను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన తీర్మాణాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసిలు సాగుచేసుకుంటున్న పోడు, లావణి భూములకు పట్టాలు ఇవ్వాలని, ఎస్టీల కోసం ఏర్పాటుచేసిన సబ్‌ప్లాన్ నిధులను గిరిజనుల అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని, మైదాన ప్రాంత గిరిజనులకు ప్రతీ జిల్లా కేంద్రంలో ఐటీడీఏలను ఏర్పాటుచేయాలని కోరారు. ఎస్టీల 10శాతం రిజర్వేషన్‌ను కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చి 7.5శాతం నుంచి 14శాతం పెంచాలనే డిమాండ్లతో నిర్వహించే ధర్నాకు గిరిజనులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో గిరిజన రిజర్వేషన్ సంఘం రాష్ట్ర నాయకులు శ్రాణ్‌కుమార్, ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు నరేశ్‌నాయక్, ప్రదాన కార్యదర్శి లక్ష్మణ్‌నాయక్, సుభాశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఉత్సవాలకు హాజరైన విశ్వేశ్వర్‌రెడ్డి, తదితరులు

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

దోమ: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డది అన్నారు. ఆదివారం ఆయన మండల పరిధిలోని దొంగ ఎన్కేపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి, మైసమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలకు హాజరై శాంతి హోమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, సర్పంచ్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ది సంక్షేమ పాలన



సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

పూడూరు: సీఎం కేసీఆర్ సంక్షేమ పాలన అందిస్తూ.. రాష్ట్రానికి దేశానికే ఆదర్శంగా నిలిపారని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. పల్లె బాటలో భాగంగా ఆదివారం ఆయన మండల పరిధిలోని మంచన్‌పల్లి, గుట్టపల్లి, తుర్క ఎన్కేపల్లి, నిజాంపేట్, మేడిపల్లి, చింతలపల్లి, కంకల్, పుడుగుర్తి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ఏర్పాటు జరగక ముందు ఏర్పడిన తర్వాత జరిగిన అభివృద్ధి పనులను ప్రజలే బేరీజు వేసుకోవాలన్నారు. వేసవి వచ్చిందంటే మహిళలు బిందెలు పట్టుకుని వ్యవసాయ బావుల వద్దకు పరుగులు తీయాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు. ప్రస్తుతం మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికి తాగు నీరు అందిస్తున్నామని తెలిపారు. మిషన్ కాకతీయ, పింఛన్లు, దళితబంధు, రైతుబంధు, రైతు బీమా తదితర పథకాలు అమలు చేస్తూ పేదలను ఆదుకుంటున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మల్లేశం, జెడ్పీటీసీ సభ్యురాలు మేఘమాల, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రత్యేక రాష్ట్రంలో తీరిన నీటి కష్టాలు



మోమిన్‌పేట: ఎమ్మెల్యేను గజమాలతో సత్కరిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



అనంతగిరి: మంచినీళ్ల పండుగలో పాల్గొన్న మున్సిపల్ సిబ్బంది, ఆర్పీలు

ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

అనంతగిరి: ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణలో తాగునీటి కష్టాలు తీరాయని ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగ నిర్వహించారు. వికారాబాద్ పట్టణం అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ఇంటికి తాగునీరు అందించిన మహర్షి సీఎం కేసీఆర్ అన్నారు. మిషన్ భగీరథ పథకంలో తాగునీటి కష్టాలు తీరాయన్నారు. దీంతో ఆడబిడ్డల నీటి కష్టాలు తీరాయన్నారు. అనంతరం వికారాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ చిగుళ్లపల్లి మంజుల మాట్లాడుతూ.. నాడు భగీరథుడు గంగను దివికి దించినట్లు నేడు మిషన్ భగీరథ పథకంతో ఇంటింటికి మంచినీళ్లు తీసుకొచ్చి ఆడపడుచుల కాళ్లు తడిపిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ శంషాద్ బేగం, మున్సిపల్ కమిషనర్ శరత్‌చంద్ర, ఎస్టీ అభివృద్ధి జిల్లా అధికారి కోటాజి, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది, మహిళా సంఘం ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లోకి వివిధ పార్టీల నాయకులు

వికారాబాద్ మండల పరిధిలోని మదనపల్లికి చెందిన పలువురు నాయకులు ఆదివారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ప్రతీ ఒక్కరు కృషి చేయాన్నారు. పార్టీలో చేరిన వారిలో వికారాబాద్ నాయి బ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్, మాజీ ఉపసర్పంచ్ నర్సింలు, వార్డు సభ్యులు అశోక్, ముఖ్య నాయకులు మల్లేశ్, జంగయ్య, గోవిందు, శ్రీనివాస్, గోపాల్, విజయ్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ది బాధ్యతాయుత పాలన

మోమిన్‌పేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వమే బాధ్యతాయుత పాలన అందిస్తోందని పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టరు మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బీజేపీ నియోజక వర్గ కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి పీఏసీఎస్ డైరెక్టర్ విజేందర్ రెడ్డి, వెల్‌చాల్ ఉప సర్పంచ్ జనార్దన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అనంద్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పేదలను ఆదుకునేందుకు ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతోందన్నారు. వాటిని చూసి కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీల నుంచి భారీగా పార్టీలో చేరుతున్నారని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల మద్దతు బీఆర్‌ఎస్‌కే ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీకాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, వెల్‌చాల్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

దామస్తాపూర్ సర్పంచ్‌పై దాడి

ఎనిమిది మందిపై కేసు

మర్పల్లి: పాత కక్షల కారణంగా బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన దామస్తాపూర్ సర్పంచ్ క్లోం జైపాల్‌రెడ్డిపై దాడిచేశారు. ఈ ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత సర్పంచ్ తెలిపిన ప్రకారం.. దశాబ్ది ఉత్సవాలు నిర్వహించేందుకు సర్పంచ్ ఆదివారం మర్పల్లి మండల కేంద్రానికి చేరకున్నాడు. ఆయన పీఎస్ సమీపంలో నడుచుకుంటూ వెళ్తున్నాడు. సర్పంచ్ కదలికలను పసిగట్టిన గ్రామస్తులు ఉదయం 11గంటల ప్రాంతంలో ఓ ఎనిమిది కారులో వచ్చి కర్రలతో విచక్షణా రహితంగా దాడి చేశారు. దీంతో ఆయన తీవ్రంగా గాపడ్డాడు. గమనించిన పోలీసులు వెంటనే మర్పల్లి ఆస్పత్రిలో చికిత్స చేసి ఇంటికి పంపారు. అనంతరం సర్పంచ్ గ్రామానికి చెందిన విఠల్‌రావు, రవివర్మ, తుకారాం, శ్రీనివాస్, శ్రీధర్ రావు, గోదారి, తారమ్మతో పాటు మరో గుర్తు తెలియని దాడి చేసినట్లు ఫిర్యాదు చేశాడని ఎస్‌ఐ అరుణ్‌కుమార్ గౌడ్ తెలిపారు. దాడి చేసిన వ్యక్తులు పరారీలో ఉన్నారని.. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ అరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.4లక్షల సాయం

కుల్కచర్ల: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కానిస్టేబుల్ షరీఫ్ కుటుంబానికి సహోద్యోగులు అండగా నిలిచారు. 2020 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ షరీఫ్ శామీర్‌పేట పీఎస్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. విధి నిర్వహణలో ఉన్న షరీఫ్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ మేరకు సహోద్యోగులు మండల పరిధిలోని రాంపూర్‌కు చేరకుని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. రూ.4లక్షల ఆర్థికసాయం అందజేశారు.



ఆర్థికసాయం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

దైవదర్శనానికి వెళ్తుండగా కారు బోల్తా



గుంతలో పడిపోయిన కారు



సౌందర్య మృతదేహం

- ఒకరి మృతి.. మరొకరి పరిస్థితి విషమం
- ఏడుగురికి స్వల్పగాయాలు

పెద్దేముల్: దైవదర్శనానికి వెళ్తుండగా కారు బోల్తాపడి ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ఈ ఘటన ఆదివారం పెద్దేముల్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ విద్యాచరణ్ రెడ్డి తెలిపిన ప్రకారం.. హైదరాబాద్‌కు చెందిన తొమ్మిది మంది తాండూరు పట్టణంలోని భూ కైలాస్ ఆలయంలో దర్శనం చేసుకుని బీదర్ నర్సింహ స్వామి దర్శనానికి వెళ్తున్నారు. మండల పరిధిలోని ఆత్కూర్ వద్ద మలుపు ఉండడంతో అతివేగం కారణంగా కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న సౌందర్య(22), శివాని తీవ్రంగా గాయపడ్డారు. మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా సౌందర్య మృతి చెందింది. తీవ్ర గాయాలైన శివానిని మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. సైదాబాన్, కుషాల్(డ్రైవర్), వంశీ, సాయికృష్ణ, అనిల్, భానుప్రకాశ్, సాయి కార్తీలకు జిల్లా ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

బెల్ట్‌షాప్ తొలగించమన్నందుకు పోలీసులకు ఫిర్యాదు

ధారూరు: గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహించొద్దన్నందుకు గ్రామస్తులపై ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గట్టెపల్లిలో మద్యం విక్రయాలను జరుపొద్దని తీర్మానం చేసిన గ్రామస్తులు ఆదివారం బోయిని శ్రీను బెల్ట్‌షాపునకు వెళ్లి మద్యం అమ్మవద్దని సూచించారు. దీంతో బెల్ట్‌షాపు నిర్వాహకుడు శ్రీను గ్రామస్తులను దూషించాడు. అంతటితో ఆగకుండా గ్రామస్తులు తనపై దాడి చేశారని శ్రీను పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విషయం తెలుసుకున్న గ్రామస్తులంతా పీఎస్‌కు చేరుకున్నారు. గ్రామంలో మద్యం అమ్మకాలను నిలిపివేయాలని 15 రోజుల క్రితమే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని.. అయినప్పటికీ శ్రీను మద్యం అమ్మకాలు చేపడుతున్నాడని పోలీసులకు వివరించారు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దరఖాస్తుల స్వీకరణకు గడువు పెంచాలి

జీసీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్‌యాదవ్

బంట్వారం: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి అందించే రూ.లక్ష ఆర్థికసాయానికి సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తుల గడువును ఈ నెల 30 వరకు పెంచాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ.లక్ష్మణ్‌యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. లేదంటే కుల వృత్తులు, చేతి వృత్తుల వారికి మద్దతుగా ధర్నా చేపడుతామని ఆయన హెచ్చరించారు. ఇదే విషయమై వెనుక బడిన తరగుతుల సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ బుర్ర వెంకటేశంను కలిసి మెమోరండం అందజేస్తానన్నారు.

యువతి అదృశ్యం



సంగీత(ఫైల్)

కేశంపేట: మండలంలోని తూర్పు గడ్డ తండాకు చెంది యువతి అదృశ్యమైన సంఘటపై ఆదివారం కేసు నమోదైంది. ఎస్‌ఐ ధనుంజయ కథనం మేరకు.. తూర్పుగడ్డ తండాకు చెందిన కాట్రావత్ జగన్ కూతురు సంగీత హైదరాబాద్ అమీర్‌పేటలోని సన్‌సిటీ ఆసుపత్రిలో నర్సుగా పని చేస్తోంది. ఈ నెల 15న గ్రామంలో పెళ్లి చూపులు జరిగాయి. ఆ రోజు సాయంత్రం హైదరాబాద్ వెళ్లిన సంగీత సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ చేసింది. ఆమె ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో తండ్రి జగన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

చేరికలను స్వాగతిస్తాం

- కాంగ్రెస్ తాండూరు అసెంబ్లీ టికెట్ రమేష్ మహరాజ్‌కే
- పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్



సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

తాండూరు: కాంగ్రెస్ పార్టీలో ఎవరు చేరినా స్వాగతిస్తామని పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఉత్తమ్‌చంద్ అన్నారు. ఆదివారం ఆయన సిండికేట్ భవనంలో పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల సాక్షి దినపత్రికలో పట్నం మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరనున్నట్లు కథనం ప్రచురితమైందని.. కానీ తమకు అధిష్టానం నుంచి ఎటువంటి సమాచారం లేదన్నారు. పార్టీలోకి ఎవరు వచ్చినా రమేశ్ మహరాజ్ గెలుపునకు పని చేయాలన్నారు. దివంగత మాజీ మంత్రి మాణిక్‌రావు రాష్ట్ర రాజకీయాలలో కీలకంగా పని చేశారన్నారు. ఆ నేత తనయుడు రమేష్ మహరాజ్ కే కాంగ్రెస్ అధిష్టానం మొదటి ప్రాధాన్యత ఇస్తారన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల సమయంలో రమేశ్ మహరాజ్ అనారోగ్య కారణాల వల్ల పోటీ చేయలేదన్నారు. రమేష్ మహరాజ్ ప్రతిపాదిస్తేనే రోహిత్‌రెడ్డికి కాంగ్రెస్ అధిష్టానం టికెట్ ఇచ్చిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన రోహిత్‌రెడ్డి విలువలు లేకుండా బీఆర్‌ఎస్‌లో చేరారన్నారు. ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డిలు డ్రామాలాడుతూ తాండూరు రాజకీయాలను భ్రష్టు పట్టించారన్నారు. అయితే ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మహేందర్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతారని ప్రచారం జరుగుతోందని.. దీంతో పార్టీ నాయకులు మనోవేదనకు గురవుతున్నారన్నారు. నియోజవకర్గ కార్యకర్తలకు భరోసా కల్పించేందుకే సమావేశం ఏర్పాటు చేశామన్నారు. పార్టీలోకి ఎవరు వచ్చిన సీనియర్ నాయకులకు, కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చిన తాండూరులో కాంగ్రెస్ గెలవడం ఖాయమన్నారు. ఈ సమావేశంలో పార్టీ తాండూరు మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, పీసీసీ మాజీ డెలిగేట్ సర్దార్ ఖాన్, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పి.బస్వరాజ్, నాయకులు జనార్ధన్‌రెడ్డి, హబీబ్‌లాల, నాగప్ప, పురుషోత్తంరెడ్డి, నర్సిరెడ్డి, జర్నప్ప, గౌస్ తదితరులున్నారు.

చెరువులో పడి వ్యక్తి మృతి



వెంకటయ్య మృతదేహం

షాద్‌నగర్ రూరల్: ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట శివారులో శనివారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ రాంచందర్ కథనం ప్రకారం.. మండలంలోని ఎలికట్ట గ్రామానికి చెందిన వెంకటయ్య(55) పశువులను మేపేందుకు శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లాడు. సాయంత్రం కాలకృత్యాలు తీర్చుకునేందుకు గ్రామ శివారులోని లాడెం చెరువు వద్దకు వెళ్లాడు. ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. రాత్రి వరకు వెంకటయ్య ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆదివారం ఉదయం చెరువు పరిసరాల్లో వెతుకుతుండగా చెరువు గట్టుపై వెంకటయ్య ద్విచక్ర వాహనం, బట్టలు కనిపించాయి. దీంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టి మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి భార్య మాణెమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ రాంచందర్ తెలిపారు.